క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: వడదెబ్బతో మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు పి. నాగేశ్వరరావు కుటుంబానికి జీవీఎంసీ అధికారులు అండగా నిలిచారు. శనివారం ఉదయం జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏఎంహెచ్‌వో కృష్ణం రాజు తదితరులు బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. జీవీఎంసీ తరఫున తక్షణ సాయం కింద రూ.15వేలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య నాయుడు మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎస్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, సహచర కార్మికులు పాల్గొన్నారు.

'ఆణిముత్యాలు'కు సత్కారం



ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన జీవీఎంసీ 40వ వార్డులోని జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులను శనివారం ఘనంగా సత్కరించా రు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని టాపర్లుగా నిలిచిన నవశ్రీ, సుప్రియ, అనూషలను మెడల్, సర్టిఫికెట్, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షు డు వరపల మహేష్, సచివాలయ కన్వీనర్లు మీసాల సత్యనారాయణ, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ సోయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మహారాణిపేట : ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీమ్ కోసం గత వారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథం ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం తాటిచెట్లపాలెం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మథరావు, డీఆర్‌పీ ప్రతాప్‌కుమార్, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

మురళీనగర్: మరింత విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వాకర్స్ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వాకర్స్ క్లబ్ మూలనిధి రూ.11 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచాలని, జూలై 1న వాకర్స్ క్లబ్ పూర్వ అధ్య క్షుడు, దాత నిమ్మగడ్డ బుచ్చయ్య 90వ జన్మదినోత్సవం, జూలై 4న అల్లూరి సీతారామరాజు వర్ధంతి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని సభ్యులంతా నిర్ణయించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, చిలకపాటి కృష్ణమూర్తి, కుప్పిలి ద్వారకానాథ్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి తరం బాగు కోసం..



విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్టు అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



ఆశవానిపాలెం స్కూల్‌లో జేవీకే కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముర్రు వాణి

గోపాలపట్నం: రేపటి తరం బాగు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. కరాసా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివార జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత ప్రభుత్వ పాఠశాలలకు తగిన గుర్తింపును తీసుకొచ్చారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం ద్వారా కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని, అమ్మ ఒడి పథకం ద్వారా బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉంటున్నారని చెప్పారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగిందని వివరించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు వంటి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని జియ్యాని శ్రీధర్ ఆకాంక్షించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుకల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశి జంక్షన్ సుభాష్‌నగర్, ఆశవానిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ ముర్రు వాణి విద్యార్థులకు కిట్లు అందజేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాఠశాలలు కళకళలాడుతున్నాయని, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో పితృదేవోభవ వేడుకలు



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని. చిత్రంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ప్రపంచ పితృదినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ విభాగం అధ్వర్యంలో 'పితృదేవోభవ'వేడుకలు ఘనంగా నిర్వహించారు. తండ్రి గొప్పదనం, అమ్మాయిల జీవితంలో తండ్రి పాత్ర, సమాజంలో తండ్రి ప్రాధాన్యత, ఆదర్శప్రాయులైన తండ్రులు అనే అంశాలపై వక్తృత్వం, వ్యాసరచన, గీతాలాపన, కవితల పోటీ నిర్వహించినట్లు హిందీ విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు తమ తండ్రే తమ హీరోగా అభివర్ణిస్తూ ప్రసంగాలు చేశారు. నేటితరం తండ్రులు తమ కూమార్తెలను అన్ని రంగాల్లో ముందుండేలా ప్రోత్సహిస్తున్నారని, వివాహం కంటే విద్యకే పెద్ద పీట వేస్తున్నారని అమ్మాయిలు అభిప్రాయపడ్డారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ వేడుకలను ప్రారంభించారు. హేమ, నందిని, లిఖిత, గాయిత్రి, ఖుషి విజేతలుగా నిలిచారని, వీరికి సోమవారం బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



సంపత్ వెంకన్నకు పూజలు



కలియుగ వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, సేవా దళ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం వెంకన్నకు నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, పవలింపు సేవ నిర్వహించారు.

➡ తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అర్చనలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల రక్తదానం



దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న షిప్‌యార్డ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి



రక్తదానం చేస్తున్న షిప్‌యార్డ్ ఉద్యోగులు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలో సంస్థ ప్రధాన వైద్యాధికారిచంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చైర్మన్ హేమంత్‌ఖత్రి, డైరెక్టర్ జె.పి.గుప్తా మాట్లాడుతూ రక్తదానం వల్ల ప్రాణపాయ స్థితిలో ఉన్న ఎంతో మంది ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 150 మంది షిప్‌యార్డ్ ఉద్యోగులు రక్తదానం చేశారు.

ధ్యాన ఉత్సవం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం జవహర్‌నగర్‌లో అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో 108 రోజుల పాటు నిర్వహించనున్న ధ్యాన ఉత్సవ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. సీనియర్ పిరమిడ్ మాస్టర్, మాజీ ఎమ్మెల్సీ ఆర్.రత్నకుమారి అతిథిగా మాట్లాడుతూ భగవాన్ బ్రహ్మర్షి పితామహ ప్రత్రీజీ ఆశీస్సులతో ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు 108 రోజుల పాటు ధ్యానంలో శిక్షణ ఉంటుందన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. పిరమిడ్ ట్రస్టు సభ్యులు ఇందిరా, రేవతిదేవి, డాక్టర్ భాగ్యగౌరీ, వి.డి.రావు, సత్యవతి, పద్మావతి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం: బిర్లా జంక్షన్ సమీపంలోని ఏఆర్ మార్బుల్స్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. శుక్రవారం రాత్రి 1.15 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. డివైడర్‌పై నిద్రిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. చెప్పులు డివైడర్ పక్కన ఉన్నాయి. షర్ట్ తీసి పక్కన డివైడర్‌పై ఉంచాడు. అయితే షర్టుపై టైలర్ స్టిక్కర్ సోసియాలిస్ట్ టైలర్స్ కందుకూరు అని రాసి ఉంది. దీన్ని బట్టి ఈ వ్యక్తి నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందినవాడిగా భావిస్తున్నారు. మృతుని వివరాలు ఫొటోలు ఆ ప్రాంత పోలీస్ స్టేషన్‌కు పంపామని తెలిపారు. ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తిస్తే సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

కొనసాగిన కాన్టెక్ ఎక్స్‌పో -2023



మాజీ చైర్మన్ కుమార్ రాజాను సత్కరిస్తున్న ఎక్స్‌పో నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పత్తులను తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్టుగార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు. ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు కొనసాగాయి. కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే యువత మద్దతు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కమిటీల్లో నియామకాలు



ఆళ్ల శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని శివగణేష్ విజ్ఞప్తి చేశారు

నేడు మహా రక్తదాన శిబిరం

సింహాచలం: అడవివరంలోని నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న ఆర్.ఆర్.ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. రక్తదాతలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మదర్‌బ్లడ్ బ్యాంక్, అమ్మ బ్లడ్ సెంటర్, విశాఖ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వాహన చోదకుడిపై ఫిర్యాదు

మర్రిపాలెం: ఒక ద్విచక్ర వాహనదారుడిపై ఆటోడ్రైవర్ ఫిర్యాదు చేశారని ఐదో పట్టణ పోలీసులు తెలిపారు. బైరెడ్డి నగేష్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో రెడ్డికంచరపాలెంలో నివసిస్తున్నాడు. గత నెల 5న రెడ్డికంచరపాలెం రోడ్డులోని ఆర్చ్ వద్ద ఆటో పార్క్‌చేయగా.. మద్యం మత్తులో లోవరాజు అనే వ్యక్తి బైకుపై వచ్చి నగేష్‌ని ఢీకొట్టాడు. కాలుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతడిని ప్రైవేట్ నర్సింగ్ హోంలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ 23వ తేదీన ఆపరేషన్ చేశారు. వైద్యం ఖర్చులు భరిస్తానన్న లోవరాజు పట్టించుకోవడం లేదని నగేష్ భార్య పావని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



గూదె రాజీవ్

మర్రిపాలెం: ఒక విద్యార్థి అదృశ్యమైన ఘటనపై ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దరి బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌కు చెందిన గూదె రాజీవ్ ఒక కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల అతడు కాలేజీకి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం దరఖాస్తు కోసం అంటూ బైకుపై కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. తన కోసం వెతకొద్దని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా రాజీవ్ మెసేజ్ పంపాడు, వారు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తండ్రి వెంకట అప్పారావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.వి జయకుమార్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్.మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ హిత విశాఖకు కృషి



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: దేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ లైఫ్, విశాఖలో అమలు చేస్తున్న ఎకో వైజాగ్ కార్యక్రమాలను జయప్రదం చేద్దామని, పర్యావరణ హిత విశాఖకు పాటుపడదామని ఎన్ఎంసీహెచ్ స్కూల్ ఉపాధ్యాయిని ఆర్.జి.ప్రభావతి పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో శనివారం పి అండ్ టీ కాలనీలోని ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎడారీకరణ, కరువును ఎదుర్కొనే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని ఏటా ఐక్య రాజ్య సమితి నిర్వహిస్తోందన్నారు. స్థిరమైన అభివృద్ధి చెందిన, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కరువు అత్యంత ప్రభావితం చూపిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మన భూగోళాన్ని సమస్త జీవరాశితో కళకళలాడేలా చూద్దామని ఆకాంక్షించారు. ప్రాణవాయువును 21 శాతం నుంచి 23.5 శాతానికి పెంచుకుందామన్నారు. అనంతరం విద్యార్థులు ఎకో వైజాగ్ ప్లకారులు ప్రదర్శించారు. గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జె.వి. రత్నం, సేవా సమాజం ప్రతినిధి మౌనిక, టీచర్లు రాధాదేవి, ఎస్.గీత పాల్గొన్నారు.

సింహగిరి.. భక్త ఝురి



సింహగిరిపై క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకోవడానికి గంటల తరబడి నిరీక్షించారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయసాల, కేశఖండన సాల, ట్రాన్స్‌పోర్టు బస్సులు, ఆర్టీసీ బస్సులు, అన్నప్రసాద భవనం భక్తులతో రద్దీగా మారాయి. మధ్యాహ్నం రాజభోగం సమయంలో భక్తులు మాడ వీధులు తీరారు. దేవస్థానం ఉద్యోగులంతా డిప్యుటేషన్‌పై సింహగిరిపై విధులు నిర్వర్తించారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శనివారం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.